క్లుప్తంగా

రగ్బీ విజేత కర్నూలు జట్టు



ట్రోఫీ అందుకుంటున్న కర్నూలు రగ్బీ జట్టు

కర్నూలు (టౌన్): పశ్చిమగోదావరి జిల్లా పెదవేగి ఏపీఎస్‌డబ్ల్యూఆర్, కళాశాల మైదానంలో ఈ నెల 5, 6 తేదీల్లో నిర్వహించిన 68వ రాష్ట్రస్థాయి అండర్–19 రగ్బీ పోటీల్లో కర్నూలు బాలుర జట్టు విజయం సాధించి బంగారు పతకం కైవసం చేసుకుంది. రాష్ట్రస్థాయిలో కర్నూలు జట్టు సత్తా చాటడంపై జిల్లా ఇంటర్ బోర్డు వృత్తి విద్యాధికారి పరమేశ్వర్ రెడ్డి, ప్రాంతీయ ఇంటర్ బోర్డు అధికారి గురువయ్య శెట్టి, ఆర్గనైజింగ్ కార్యదర్శి హర్షవర్ధన్, ఆంధ్రప్రదేశ్ రగ్బీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు సోమవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు.

చదరంగం పోటీలకు ఆహ్వానం



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ రంజిత్‌బాషా, ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి తదితరులు

కర్నూలు(సెంట్రల్): ఈ నెల 17వ తేదీన ఎదురూరు రాజావర్ధన్ రెడ్డి జ్ఞాపకార్థం కర్నూలు మండలం బి.తాండ్రపాడులోని క్రేడో పాఠశాలలో రాష్ట్రస్థాయి చందరంగం పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆంధ్ర చెస్ అసోసియేషన్ డైరెక్టర్ రవినాయక్ తెలిపారు. ఈ పోటీలకు సంబంధించి సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా, కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, టీడీపీ నాయకుడు డి.విష్ణువర్ధన్ రెడ్డి పోస్టర్లను ఆవిష్కరించారు. ఆసక్తి ఉన్న వారు పోటీల్లో పాల్గొనాలని కోరారు.

పోస్టల్ సేవలను వినియోగించుకోండి

కర్నూలు(అర్బన్): పోస్టల్ శాఖ అందిస్తున్న సేవలను ప్రజలందరూ వినియోగించుకోవాలని సూపరింటెండెంట్ జనార్ధన్‌రెడ్డి కోరారు. సోమవారం ప్రారంభమైన జాతీయ తపాలా వారోత్సవాల్లో భాగంగా కర్నూలు పోస్టల్ డివిజన్ పరిధిలోని బీఎస్‌పీఎల్ వినియోగదారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ స్పీడ్ పోస్టు సర్వీస్ గురించి వివరించారు. డాక్ ఘర్ నిర్యత్ కేంద్రాన్ని కర్నూలు హెడ్ పోస్టాఫీసులో ఏర్పాటు చేశామన్నారు. చిన్న, సూక్ష్మ, మధ్య తరహా పరిశ్రమల వారు తమ వ్యాపార ఉత్పత్తులను విదేశాలకు సులువుగా పంపించవచ్చన్నారు. అసిస్టెంట్ పీఎస్ రహిమాన్, నూరుల్లా, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ గరీబ్‌భాషాతో పాటు పోలీస్, ఇన్‌కం ట్యాక్స్, ఎల్ఐసీ, ఆలిండియా రేడియో, ఐడీబీఐ బ్యాంకు తదితర సంస్థల ప్రతినిధులు హాజరయ్యారు.

కుష్టు, క్షయను సంపూర్ణంగా నిర్మూలించాలి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎల్.భాస్కర్

కర్నూలు(హాస్పిటల్): జిల్లాలో 2025 నాటికి క్షయ, కుష్టు వ్యాధులు పూర్తిగా అంతం కావాలన్న లక్ష్యంతో పనిచేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ ఎల్.భాస్కర్ సూచించారు. సోమవారం ఆసుపత్రిలోని ఓల్డ్ లెక్చర్ గ్యాలరీలో నోడల్ ఆఫీసర్స్, డేటా ఎంట్రీ ఆపరేటర్లకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ.. ఎవరికైనా స్పర్శలేని రాగి రంగు మచ్చలు ఉంటే పరీక్షలు చేయించాలన్నారు. కుష్టు వ్యాధిగ్రస్తులను తొందరగా గుర్తించడం వల్ల అంగవైకల్యం నుంచి రక్షించవచ్చని చెప్పారు. రెండు వారాలకు మించి దగ్గు, కఫంతో పాటు రాత్రి పూట జ్వరం రావడం, బరువు తగ్గడం, ఆకలి మందగించడం వంటి లక్షణాలుంటే నిర్ధారణ పరీక్షలు చేయించాలని సూచించారు. కుష్టు, క్షయ నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రాజెక్టర్ ద్వారా డిస్ట్రిక్ట్ న్యూక్లియస్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మల్లికార్జున్‌రెడ్డి అవగాహన కల్పించారు. డీపీఎంఓ విజయరాజు, సుబ్రహ్మణ్యం, ప్రాజెక్షనిస్టు ఖలీల్ పాల్గొన్నారు.

యోగా విజేతలకు బహుమతుల ప్రదానం

కర్నూలు (టౌన్): రెండు రోజులుగా జరుగుతున్న యోగా రాష్ట్రస్థాయి చాంపియన్‌షిప్ పోటీలు సోమవారం సాయంత్రం ముగిశాయి. విజేతలకు మంత్రి టీజీ భరత్ బహుమతులు, మెడల్స్, షీల్డ్, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. మన దేశానికే పరిమితమైన యోగాను ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా అన్ని దేశాల్లో అనుసరిస్తున్నారన్నారు. ఎస్పీ బిందుమాధవ్, కేవీ సుబ్బారెడ్డి, ఏపీఎస్‌పీ డీఎస్పీ మహబూబ్‌బాషా, యోగాసన అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు రాధిక, జిల్లా కార్యదర్శి ప్రభాకర్ పాల్గొన్నారు. **విజేతలు వీరే..:** ట్రెడిషనల్ జూనియర్స్ బాలికల విభాగంలో కె.పల్లవి (ప్రథమ, కర్నూలు), భార్గవి (ద్వితీయ, గుంటూరు) త్రివేణి (తృతీయ, గుంటూరు), బాలుర విభాగంలో మనోహర్ (ప్రథమ, ఎన్టీఆర్ జిల్లా), లలిత్‌కుమార్ (ద్వితీయ, తిరుపతి), లవర్ధన్ (తృతీయ, అనకాపల్లి), సబ్ జూనియర్ బాలికల విభాగంలో వైష్ణవి,కౌసల్య(ప్రథమ, ద్వితీయ–అనకాపల్లి) ,హర్షవర్ధని (తృతీయ, కాకినాడ) నిలిచారు.

అమ్మతనానికి ఆపద

- పెరుగుతున్న రొమ్ము క్యాన్సర్ బాధితులు
- జన్యుపర సమస్యలు, జీవనశైలే కారణం
- ప్రాథమిక దశలో నిర్ధారించి చికిత్స తీసుకుంటే మేలు
- ఈ నెల రొమ్ము క్యాన్సర్ అవగాహన మాసం

కర్నూలు(హాస్పిటల్): అమ్మతనానికి ప్రతిరూపం శిశువుకు పాలు పట్టడం. అలాంటి అమ్మ తనానికి ఆపద ఏర్పడితే. తల్లి రొమ్ములకు పుండు ఏర్పడి క్యాన్సర్‌గా రూపాంతరం చెందితే వారి బాధ వర్ణనాతీతం. ఇలాంటి వ్యాధిని ప్రాథమిక దశలో గుర్తించి చికిత్స తీసుకుంటే కోలుకోవచ్చు. చివరి దశలో వైద్యుల వద్దకు వెళితే మాత్రం ప్రాణాంతకం అవుతుంది. ఇలాంటి వ్యాధితో బాధపడే వారి సంఖ్య రోజు రోజుకూ పెరుగుతోంది. ఈ నెల రొమ్ము క్యాన్సర్ అవగాహన మాసం సందర్భంగా ప్రత్యేక కథనం.

పాతికేళ్ల క్రితం రాయలసీమ ప్రాంతానికంతటికీ ఒక్కరే క్యాన్సర్ వైద్య నిపుణులు ఉండేవారు. ఇప్పుడు ఒక్క కర్నూలు నగరంలోనే పాతిక మందికి పైగా క్యాన్సర్ నిపుణులు చికిత్సలు అందిస్తున్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి ప్రవేశపెట్టిన ఆరోగ్యశ్రీ పథకంతో ఎంతో ఖరీదైన క్యాన్సర్ వైద్యం పేదలకు ఉచితంగా ప్రైవేటు ఆసుపత్రుల్లోనూ లభిస్తోంది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఈ పథకానికి మరింత మార్పులు చేసి ఎంత ఖరీదైన వ్యాధి అయినా ఉచితంగా నాణ్యమైన వైద్యం అందేలా చేశారు. అన్ని రకాల క్యాన్సర్‌లకు కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలతో పాటు పెంచికలపాడులోని విశ్వభారతి క్యాన్సర్ హాస్పిటల్, కర్నూలులోని ఒమెగా క్యాన్సర్ హాస్పిటల్‌లో ఈ సేవలను ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా అందిస్తున్నారు. మొత్తం క్యాన్సర్ బాధితుల్లో 30 శాతం మంది రొమ్ము క్యాన్సర్‌తో బాధపడుతున్నట్లు వైద్యులు చెబుతున్నారు.

వ్యాధి నిర్ధారణ పరీక్షలు

మామోగ్రఫీ స్క్రీనింగ్ ద్వారా ఈ క్యాన్సర్‌లను గుర్తిస్తారు. రొమ్ములో ఏదైనా అసాధారణతను గుర్తించేందుకు ఈ రేడియోగ్రాఫిక్ సాంకేతికత ఉపయోగిస్తారు. 40 ఏళ్లు దాటిన మహిళలు ఏడాదికి ఒకసారి మామోగ్రామ్ పరీక్షలు చేయించుకోవడం ముఖ్యం.

రొమ్ము క్యాన్సర్ వ్యాధి లక్షణాలు

- రొమ్ముల్లో గడ్డలు/బరువుగా అనిపించడం
- రొమ్ముల ఆకృతి, పరిమాణం మారడం
- రొమ్ములు, చంకల్లో స్థిరంగా నొప్పి
- చనుమొనల నుంచి ద్రవాలు బయటకు రావడం
- చనుమొనల చుట్టూ ఎరుపుగా, దద్దుర్లు ఉన్నట్లుగా ఉండటం
- చనుమొనలు లోపలకు చొచ్చుకుపోయినట్లు ఉండటం, ఆకృతి మారడం
- చర్మపు రంగులో మార్పులు

రొమ్ము క్యాన్సర్ రావడానికి కారణాలు

- జన్యుపరమైన సమస్యలు, జీవనశైలి, పరిసరాల ప్రభావం, వయస్సు పెరిగే కొద్దీ రొమ్ము క్యాన్సర్ బారిన పడే అవకాశం ఎక్కువగా ఉంటుంది.
- అభివృద్ధి చెందిన దేశాలతో పోల్చితే మన దేశంలో చిన్న వయస్సులోనే ఈ క్యాన్సర్ ముంచుకొస్తోంది. అంటే 50 ఏళ్లలోపు ఉన్న వారిలో రొమ్ము క్యాన్సర్ బయటపడుతోంది.
- చిన్న వయస్సులో రజస్వలవడం, ఆలస్యంగా మెనోపాజ్ కావడం, లేటుగా పిల్లలు కలగడం, బిడ్డకు తక్కువ కాలం చనుబాలు ఇవ్వడం, ఊబకాయం, తగినంత వ్యాయామం లేకపోవడం, ఊబకాయం ఉన్న వారి రొమ్ములో కొవ్వు కణజాలం ఎక్కువగా ఉండటం వల్ల కూడా ఈ క్యాన్సర్ సోకే ప్రమాదం ఉంది.
- మన ఆహారంతో శరీరంలోకి ప్రవేశించే పురుగుమందులు శరీరంలో ఈస్ట్రోజెన్ లాగా పనిచేస్తాయి. నెలసరి ఆగిపోయిన తర్వాత వచ్చే ఊబకాయంతో రొమ్ము క్యాన్సర్ పెరిగే అవకాశం ఉంది. అంతకు ముందే అధిక బరువు ఉన్న వారిలో కూడా ఈ ప్రమాదం ఉంటుంది. ఇవి క్యాన్సర్ ముప్పు పెరిగేలా చేస్తాయి.



ప్రతీకాత్మక చిత్రం

ఆరేళ్లలో రొమ్ము క్యాన్సర్ కేసులు ఇలా..

సంవత్సరం	సర్జికల్ ఆంకాలజీ	మెడికల్ ఆంకాలజీ	రేడియేషన్ ఆంకాలజీ
2019–20	1,892	2,569	1,802
2020–21	3,658	4,125	3,512
2021–22	4,396	5,236	4,239
2022–23	5,124	5,796	4,939
2023–24	5,775	6,164	5,594
2024–25 (ఇప్పటివరకు)	2,109	2,814	2,418

స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌లో అత్యాధునిక సేవలు



కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల ఆవరణలో ఇటీవల ప్రారంభమైన స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌లో అత్యాధునిక వసతులు, పరికరాలు అందుబాటులోకి వచ్చాయి. రూ.34 కోట్ల విలువైన లీనియర్ ఆక్సిలేటర్ మిషన్ కూడా ఉంది. వీటితో పాటు మెడికల్, సర్జికల్, రేడియేషన్ ఆంకాలజీకి సంబంధించిన వైద్యులు ఉన్నారు. ఇక్కడ అన్ని రకాల క్యాన్సర్లకు వైద్యం అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. ఆసుపత్రికి వస్తున్న క్యాన్సర్లలో 30 శాతం మంది రోగులు రొమ్ము క్యాన్సర్‌తో బాధపడుతున్నారు. రొమ్ము క్యాన్సర్‌ను మామోగ్రఫీ స్కాన్ ద్వారా నిర్ధారించవచ్చు. ఇందుకు సంబంధించిన పరికరం ఆసుపత్రిలో ఏర్పాటు చేశాం.

–డాక్టర్ పీఎస్‌కే ప్రకాష్, డైరెక్టర్, స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్, కర్నూలు

త్వరగా గుర్తిస్తే మేలు



ఇటీవల కాలంలో రొమ్ము క్యాన్సర్ కేసులు బాగా పెరుగుతున్నాయి. ఇది వంశ పారంపర్యంతో పాటు స్థూలకాయం, కొవ్వు పదార్థాలు అధికంగా తీసుకోవడం వల్ల వస్తుంది. దీన్ని రొమ్ములను స్వయంగా చేతులతో స్పర్శించి పరీక్షించుకోవడం, మామోగ్రఫీ పరీక్ష ద్వారా నిర్ధారించుకోవచ్చు. 45 సంవత్సరాలు దాటిన ప్రతి మహిళ తప్పనిసరిగా మూడేళ్లకోసారి ఈ పరీక్ష చేయించుకోవాలి. దీనికి శస్త్ర చికిత్స ఒక్కటే పరిష్కారం. త్వరగా గుర్తిస్తే చిన్న శస్త్రచికిత్స, మందులతో నయం చేసుకోవచ్చు. లేకపోతే ప్రాణాంతకమవుతుంది. రొమ్ము క్యాన్సర్ ఉన్న తల్లులు బిడ్డకు చనుబాలు ఇవ్వరాదు.

– డాక్టర్ టి.జ్యోత్స్న, గైనకాలజిస్టు, కర్నూలు

భక్తి యాత్రను విజయవంతం చేద్దాం



వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డితో కమిటీ సభ్యులు

కర్నూలు (టౌన్): కార్తీక మాసం పురస్కరించుకుని 9వ తేదీన పాతబస్టాండ్‌లోని చెన్నకేశవస్వామి ఆలయం నుంచి తిరుమలకు బయలుదేరుతున్న భక్తి చైతన్య మహాపాదయాత్రను విజయవంతం చేద్దామని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం సాయంత్రం స్థానిక ఎస్వీ మోహన్‌రెడ్డి స్వగృహంలో ఏర్పాటు చేసిన సమావేశంలో చెన్నకేశవస్వామి ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 12 రోజుల పాటు కొనసాగనున్న ఈ పాదయాత్రలో 850 మంది భక్తులు పాల్గొంటారని, కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు దాతలు ముందుకు రావాలన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకురాలు ఎస్వీ విజయమనోహరి, కమిటీ సభ్యులు పాలూరి శివయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు పౌరాణిక నాటక ప్రదర్శనలు

కర్నూలు కల్చరల్: దసరా నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని కళావాహిని సాంస్కృతిక సాహితీ సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం 6.30 గంటలకు అశోక్ నగర్ ప్రసన్నాంజనేయ స్వామి, ద్వారకా మాయి సాయిబాబా దేవాలయం వద్ద ఉచిత పౌరాణిక నాటక ప్రదర్శనలు ఏర్పాటు చేసినట్లు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు ఎం.మనోహర్‌బాబు తెలిపారు. భరత నాట్యం, కూచిపూడి నృత్య ప్రదర్శనలు, హరికథా గానం, బుర్రకథా గానం, మయ సభ దుర్యోధన ఏకపాత్రాభినయం, శ్రీకృష్ణ పడక సీను, గయోపాఖ్యానం యుద్ధ సీను, భవాని– చింతామణి సీను ప్రదర్శనలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

సంక్షిప్తం

సుంకేసులకు వరద ప్రవాహం

కర్నూలు సిటీ: తుంగభద్ర నదిపై నిర్మించిన సుంకేసుల బ్యారేజీకి ఎగువ నుంచి వరద ప్రవాహం కొనసాగుతుంది. సోమవారం వరద నీటి ప్రవాహం మరింత పెరిగింది. జిల్లాలోని పశ్చిమ ప్రాంతంతో పాటు, తుంగభద్ర నది పరివాహక ప్రాంతం, ఏపీ కర్ణాటక రాష్ట్రాల మధ్య ఉన్న వేదావతి నది పరివాహక ప్రాంతంలో కురిసిన వర్షాల వల్ల బ్యారేజీకి ఉదయం వరద నీటి ప్రవాహం 10 వేల క్యూసెక్కులకుపైగా పెరిగి, సాయంత్రానికి 5 వేల క్యూసెక్కులకు తగ్గింది. ప్రస్తుతం ఎగువ నుంచి 33,650 క్యూసెక్కుల నీటి ప్రవాహం ఇన్‌ఫ్లో ఉంది. ఇందులో కేసీ కాలువకు 2265 క్యూసెక్కులు, మిగతా నీటిని బ్యారేజీ 7 గేట్లు పైకెత్తి దిగువకు 31,353 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.

కొనసాగుతున్న టెట్ పరీక్ష

కర్నూలు సిటీ: ఉపాధ్యాయ అర్హత పరీక్షలు కొనసాగుతున్నాయి. జిల్లాతో పాటు, హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన 8 పరీక్ష కేంద్రాలలో సోమవారం ఉదయం జరిగిన సెషన్‌లో 1619 మందికిగాను, 1471 మంది పరీక్షలకు హాజరుకాగా, 148 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన పరీక్షలకు 1623 మందికిగాను 1490 మంది పరీక్షలకు హాజరుకాగా 133 మంది గైర్హాజరయ్యారు.

బాల్యం నుంచే భక్తిభావం పెంపొందించాలి

కర్నూలు (టౌన్): బాల్య దశ నుంచే భక్తిభావాలను పెంపొందించడం ద్వారా బాలబాలికలు సన్మార్గంలో పయనిస్తారని పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరితారెడ్డి అన్నారు. సోమవారం స్థానిక కోల్స్ కళాశాల మైదానంలో చైల్డ్ ఎవాంజలిజమ్ ఫెలోషిప్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో 13వ చిల్డ్రన్స్ క్యాంప్ కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు. ఎమ్మెల్యే గాలిలోకి బెలూన్లు వదిలి వేడుకలు ప్రారంభించారు. చిల్డ్రన్స్ క్యాంప్ నిర్వహణ కమిటీ సభ్యులు స్టెల్లా కిరణ్‌పాల్ మాట్లాడుతూ మూడు రోజుల పాటు క్యాంప్ నిర్వహించనున్నట్లు చెప్పారు. ఇందులో బైబిల్ బోధనలు, భక్తి గీతాలు, పప్పెట్ షో, క్విజ్‌లు, చిరు నాటికలు ఉంటాయని వివరించారు. సంస్థ డైరెక్టర్ వర్గీస్, కోల్స్ చర్చి అధ్యక్షుడు లింకన్, ప్రిన్సిపల్ జెస్సీ శ్యాంసోన, క్యాంప్ డైరెక్టర్ ప్రభుదాస్, కమిటీ చైర్మన్ అనిల్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీఆర్ఎస్ఏ జిల్లా అధ్యక్షుడి మార్పు?

కర్నూలు(సెంట్రల్): ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా ఉన్న వి.గిరి కుమార్‌రెడ్డిని మార్చే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. అతనిపై వచ్చిన పలు ఆరోపణలు రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు దృష్టికి వెళ్లడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు అసోసియేషన్‌లో చర్చ సాగుతోంది. త్వరలోనే జిల్లా మహాసభలు నిర్వహించి కొత్త అధ్యక్షుడిని ఎన్నుకోనున్నట్లు సమాచారం. సోమవారం కర్నూలు వచ్చిన బొప్పరాజు వెంకటేశ్వర్లు నూతన అధ్యక్షుడి ఎంపికపై కసరత్తు చేసినట్లు తెలుస్తోంది.

సివిల్ సప్లై డీఎంగా నాగసుధ

కర్నూలు(సెంట్రల్): సివిల్ సప్లై డీఎంగా వి.నాగసుధ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న షర్మిళ స్థానంలో ఆమె విజయవాడ కార్యాలయం నుంచి సాధారణ బదిలీల్లో వచ్చి చేరారు. ఇక్కడ పనిచేస్తున్న షర్మిళ విజయవాడ కార్యాలయానికి బదిలీ అయ్యారు.

అరుదైన కిడ్నీ వ్యాధిగ్రస్తునికి చికిత్స

కర్నూలు(హాస్పిటల్): ప్రపంచంలోనే అత్యంత అరుదైన కిడ్నీ వ్యాధి కర్నూలులో వెలుగు చూసింది. కర్నూలు కిమ్స్ ఆసుపత్రిలోని కన్సల్టెంట్ నెఫ్రాలజిస్టు డాక్టర్ కె.అనంతరావు సరైన సమయానికి చికిత్స చేసి బాధితుడికి ఊరట కల్పించారు. వివరాలను సోమవారం ఆయన వెల్లడించారు. ×కర్నూలు నగరానికి చెందిన నాలుగేళ్ల బాలుడు గత రెండు నెలలుగా కాళ్లు, ముఖం వాపుతో ఇబ్బంది పడుతున్నాడని ఇటీవల ఆసుపత్రికి తీసుకొచ్చారు. కొన్ని పరీక్షలు చేయగా ప్రపంచంలోనే అత్యంత అరుదైన లిపోప్రొటీన్ గ్లోమెరులోపతి అని గుర్తించాం. దక్షిణ భారత దేశంలోనే ఇదే మొదటి కేసు. సరైన సమయానికి వ్యాధిని గుర్తించి, తగిన చికిత్స చేయకపోతే ఇలాంటి కేసుల్లో పూర్తిగా కిడ్నీ విఫలమయ్యే ప్రమాదం ఉంది' అని ఆయన పేర్కొన్నారు.

ప్రాక్టికల్ పరీక్షలు మళ్లీ నిర్వహించాలి

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో బీఈడీ ప్రాక్టికల్ పరీక్షలను మళ్లీ నిర్వహించాలని కోరుతూ సోమవారం అంబేడ్కర్ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో వర్సిటీలో రిజిస్ట్రార్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లుకు వినతి పత్రం అందజేశారు. గత నెలలో నిబంధనలకు విరుద్ధంగా నిర్వహించిన ప్రాక్టికల్ పరీక్షలను రద్దు చేయాలని నాయకులు డిమాండ్ చేశారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మధుకృష్ణ, నాయకులు చిరంజీవి, తదితరులు వినతి పత్రం ఇచ్చిన వారిలో ఉన్నారు.

శనగ విత్తనాలకు రిజిస్ట్రేషన్లు

కర్నూలు(అగ్రికల్చర్): రబీ సీజన్‌కు సంబంధించి శనగ విత్తనాల పంపిణీ పలు మండలాల్లో మొదలైంది. మరోవైపు రైతు సేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్లు కూడా చురుగ్గా జరుగుతున్నాయి. ఇప్పటికే తుగ్గలి, మద్దికెర, పత్తికొండ, హాలహర్వి, కల్లూరు, చిప్పగిరి తదితర మండలాల్లో విత్తనాల పంపిణీ మొదలైంది. జిల్లాలో దాదాపు 70 వేల హెక్టార్లలో శనగ పంట సాగు కానుంది. ప్రభుత్వం జిల్లాకు 45,955 క్వింటాళ్ల శనగ విత్తనాలు కేటాయించింది. ఇవి జిల్లా అవసరాలకు సరిపోయే పరిస్థితి కనిపించడం లేదు. ఇప్పటికే రైతులు దాదాపు 25 వేల క్వింటాళ్ల విత్తనాలకు రిజిస్ట్రేషన్లు చేసుకున్నారు. ఆంధ్రప్రదేశ్ విత్తనాభివృద్ధి సంస్థ (ఏపీ సీడ్స్) శనగ విత్తనాలను సరఫరా చేస్తోంది. ఇప్పటివరకు శనగ సాగు చేసే ప్రాంతాల్లో 12 వేల క్వింటాళ్ల విత్తనాలను అందుబాటులో ఉంచింది. నంద్యాల జిల్లాకు సంబంధించి 5 వేల క్వింటాళ్లను అందుబాటులో ఉంచినట్లు సమాచారం. నంద్యాల జిల్లాలో విత్తనాల పంపిణీ ఇంకా మొదలు కాలేదు.

సెలవులో డీఈఓ

కర్నూలు (సిటీ): జిల్లా విద్యాశాఖ అధికారిగా పనిచేస్తున్న కె.శామ్యూల్ ఈ నెల 12వ తేదీ వరకు సెలవుపై వెళ్లారు. ఆయన కుమారుడి వివాహం ఈ నెల 10వ తేదీన జరగనుండటంతో సెలవు పెట్టారు. దీంతో ఇన్‌చార్జ్ డీఈఓగా ఏడీ–2గా పనిచేస్తున్న వి.శ్రీనివాసులుకు బాధ్యతలు అప్పగించారు. తిరిగి వచ్చే సోమవారం డీఈఓ విధుల్లో చేరనున్నారు.

సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలి

కర్నూలు (టౌన్): ప్రజా సమస్యల పరిష్కారంలో పారదర్శకత పాటించాలని నగరపాలక ఇన్‌చార్జ్ కమిషనర్ ఆర్.జి.వి.క్రిష్ణ ఆదేశించారు. సోమవారం స్థానిక నగరపాలక కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఇన్‌చార్జ్ కమిషనర్ పాల్గొని ప్రజల నుంచి వచ్చిన వినతులను స్వీకరించారు. వివిధ కాలనీలకు చెందిన 19 మంది తమ సమస్యలపై వినతులు సమర్పించారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ చిన్నరాముడు, ఆరోగ్యశాఖాధికారి విశ్వేశ్వర రెడ్డి, ఆర్ఓ జునీద్, ఎంఈ సత్యనారాయణ, టీపీఆర్ఓ వెంకటలక్ష్మి, టిడ్కో అధికారి పెంచలయ్య పాల్గొన్నారు.

వచ్చిన అర్జీలో కొన్ని..

- జగన్నాథ గట్టు టిడ్కో గృహాల వద్ద మంచి నీటి సరఫరా, వీధి దీపాలు ఏర్పాటు చేయాలని స్థానిక వాసులు విన్నవించారు.
- గణేష్ నగర్‌లో నాలుగవ తరగతి ఉద్యోగుల కాలనీ ఆంజనేయ స్వామి ఆలయ సమీపంలో ఉన్న వాణిజ్య నగర్, గీతా నగర్‌లో రోడ్లు ఏర్పాటు చేయాలని ప్రశాంత్, సునీల్, వెంకటేష్ వినతిపత్రాలు అందజేశారు.
- ఆదిత్యనగర్, బళ్లారి చౌరస్తా సమీపంలోని మహీంద్రా సర్వీస్ సెంటర్ వద్ద డ్రైనేజీ నిర్మాణాలను చేపట్టాలని స్థానికులు మనోహర్ రెడ్డి, భూషణ్ కోరారు.
- సీసీ డ్రైనేజీ కాల్వలు ఏర్పాటు చేయాలని మద్దూరునగర్, ఠాగూర్ నగర్ కాలనీవాసులు దిలీప్‌కుమార్, ప్రసాద్ బాబు విన్నవించారు.
- అశోక్ నగర్ మున్సిపల్ పార్కులో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని పట్టణ పౌర సంఘం నాయకులు పుల్లా రెడ్డి ఫిర్యాదు చేశారు.
- అసంపూర్తిగా ఉన్న 81, 82వ సచివాలయాల భవనాలను నిర్మించాలని సుధాకర్ రెడ్డి, సాయిబాబా వినతి పత్రం అందజేశారు.

శనగ విత్తనాల పంపిణీ

కల్లూరు: కల్లూరు అర్బన్ 28వ వార్డు లక్ష్మీపురం గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు సబ్సిడీ శనగ విత్తనాలు పంపిణీ చేశారు. సోమవారం నిర్వహించిన పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, జేడీఏ వరలక్ష్మి, కర్నూలు డివిజన్ వ్యవసాయ సంచాలకులు సాలురెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

జెడ్పీ చైర్మన్, సీఈఓలకు ఘన సన్మానం



జెడ్పీ చైర్మన్ యర్రబోతుల పాపిరెడ్డిని సన్మానిస్తున్న అసోసియేషన్ నేతలు

కర్నూలు(అర్బన్): జిల్లా పరిషత్ చైర్మన్ యర్రబోతుల పాపిరెడ్డి, సీఈఓ జి.నాసరరెడ్డిని ఉమ్మడి కర్నూలు జిల్లా ఎంపీడీఓస్ అసోసియేషన్ నేతలు ఘనంగా సన్మానించారు. సోమవారం సాయంత్రం అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీనివాసులు, శివనాగప్రసాద్, మంజులావాణి వారికి శాలువా కప్పి, బొకేలు అందించి సన్మానించారు. వారు మాట్లాడుతూ.. ఇటీవల జరిగిన ఎంపీడీఓల బదిలీలు పూర్తి సామరస్య పూర్వకంగా, పారదర్శకంగా నిర్వహించారని కొనియాడారు. భవిష్యత్తులో కూడా ఎంపీడీఓలకు జిల్లా పరి షత్ చైర్మన్, సీఈఓల సహకారం పూర్తిగా ఉండాలని కోరారు. ఈ సందర్భంగా చైర్మన్, సీఈఓ మాట్లాడుతూ విధి నిర్వహణలో ఎంపీడీఓలు నిస్వార్థంగా వ్యవహరించాలన్నారు. విధుల పట్ల ఎక్కడా నిర్లక్ష్యం ప్రదర్శించకుండా పనిచేయాలని సూచించారు.

బాధ్యతల స్వీకరణ

కర్నూలు(సెంట్రల్): కర్నూలు నగర కాంగ్రెస్ అధ్యక్షుడిగా షేక్ జిలానీబాషా సోమవారం బాధ్యతలు చేపట్టారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో అట్టహాసంగా జరిగిన బాధ్యతల స్వీకరణ కార్యక్రమానికి ఆ పార్టీ కర్నూలు, నంద్యాల జిల్లాల అధ్యక్షులు పి.మురళీకృష్ణ, జే.లక్ష్మీనరసింహయాదవ్ హాజరయ్యారు.

పాహిమాం.. పరాశక్తి



నాగలాపురంలో మహాచండీగా..



చిన్నమార్కెట్లో కొలువుదీరిన దుర్గమ్మ



గీతా మందిరంలో కన్యకాపరమేశ్వరిగా..

కర్నూలు కల్చరల్: దసరా శరన్నవ రాత్రి ఉత్సవాల్లో భాగంగా ఐదవ రోజు సోమవారం అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. నగరంలోని ఆలయాల్లో అమ్మవారిని వివిధ రూపాల్లో అలంకరించి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. చిన్నారులకు కుమారి పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పూజల్లో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. పంచామృతాభిషేకాలు, హోమాలు, రథోత్సవం, పల్లకీ సేవ, లలితా సహస్రనామ పారాయణం, సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. నగరంలోని ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేసిన దుర్గా మాత విగ్రహాలకు పూజలు చేశారు. ఆధ్యాత్మిక నృత్యాలు, భక్తి సంగీత కచేరీలు, సంకీర్తనలు, కోలాటం, చెక్క భజన, హరి కథలు, నవరాత్రులపై ప్రవచనాలు జరిగాయి. కల్లూరు వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో నిర్వహించిన పూజల్లో మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి, కేడీసీసీబీ మాజీ చైర్‌పర్సన్ ఎస్వీ విజయమనోహరి, సూర్యనారాయణ స్వామి ఆలయంలో నిర్వహించిన పూజల్లో పత్తికొండ మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి పాల్గొన్నారు. ఆరోరా నగర్ రాజరాజేశ్వరి దేవి ఆలయంలో బాలా త్రిపుర సుందరిగా, వెంకాయపల్లె ఎల్లమ్మ ఆలయంలో లలితా త్రిపుర సుందరిగా, వన్‌టౌన్ గీతా మందిరంలో కన్యకాపరమేశ్వరిగా, చిన్నఅమ్మవారి శాలలో పార్వతీ దేవిగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు.

ఇదేం.. సాంప్రదాయం !

- కౌన్సిల్‌కు తెలియకుండా నిధులు ఖర్చు చేయడమా ?
- ఇన్‌చార్జ్ కమిషనర్‌కు వినతిపత్రం ఇచ్చిన స్టాండింగ్ కమిటీ సభ్యులు



ఇన్‌చార్జ్ కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న డిప్యూటీ మేయర్, స్టాండింగ్ కమిటీ సభ్యులు

కర్నూలు (టౌన్): ఇదేం సంప్రదాయం. అసలు ప్రజలు ఎన్నుకున్న స్టాండింగ్ కమిటీ సభ్యులకు చెప్పకుండా, తెలియకుండా నిధులు ఖర్చు చేయడం ఎంతవరకు సబబు అని నగరపాలక డిప్యూటీ మేయర్ సిద్దారెడ్డి రేణుకా, స్టాండింగ్ కమిటీ సభ్యులు విక్రమసింహారెడ్డి ప్రశ్నించారు. సోమవారం సాయంత్రం స్థానిక నగరపాలకలోని ఇన్‌చార్జ్ కమిషనర్ ఆర్.జీ.వి.క్రిష్ణను కలిసి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ.. గత నెల 30వ తేదీ కర్నూలు నగరంలో కుక్కల బారిన పడిన వారికి మంత్రి టీజీ భరత్ రూ.10 వేలు ఆర్థిక సహాయం ప్రకటించారన్నారు. బాధితులకు ఆర్థిక సహాయాన్ని వ్యతిరేకించడం లేదని, అయితే నగర పాలక జనరల్ ఫండ్స్ ఖర్చు చేస్తున్నప్పుడు స్టాండింగ్ కమిటీకి తెలియకుండా ఏకపక్షంగా నిర్ణయం తీసుకోవడం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు. మంత్రి స్థాయిలో సొంత నిధులు లేక ప్రభుత్వం నుంచి నిధులు విడుదల చేయించి ఉంటే హర్షించే వాళ్లమని స్పష్టం చేశారు. ఇప్పటికే నాలుగు నెలలుగా ప్రభుత్వం నుంచి ఒక్క రూపాయి కూడా రాలేదని, రాబోయే రోజుల్లో ప్రతి సమస్యకు నగర పాలక సంస్థ మీద ఆధారపడే పరిస్థితి ఉందన్నారు. స్టాండింగ్ కమిటీ సభ్యులు జుబేర్, షేక్ యూనస్ బాషా, కార్పొరేటర్లు షాషావలి, కృష్ణకాంత్, నాగ లక్ష్మీరెడ్డి, షేక్ మహమ్మద్ పాల్గొన్నారు.

డ్రిప్ పరికరాల మరమ్మతులపై శిక్షణ

కర్నూలు(అగ్రికల్చర్): సూక్ష్మ సేద్యం (డ్రిప్) పరికరాల్లో ఉత్పన్నమయ్యే సమస్యల పరిష్కారానికి పిట్టర్‌లను నియమిస్తున్నట్లు ఏపీఎంఐపీ ప్రాజెక్టు డైరెక్టర్ ఉమాదేవి తెలిపారు. 2024–25 సంవత్సరానికి సంబంధించి 15 వేల హెక్టార్లలో సూక్ష్మ సేద్యం సదుపాయం కల్పించే విధంగా ప్రభుత్వం లక్ష్యాన్ని ఇచ్చిందని, ఇందుకు అనుగుణంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. సూక్ష్మ సేద్య పరికరాల పనితీరు వాటిని అమర్చే విధానంపై ఆధారపడి ఉంటుందని చెప్పారు. అమర్చడంలో లోపాలను గుర్తించి పరిష్కరించాలనే లక్ష్యంతో పిట్టర్‌లను అందుబాటులోకి తెస్తున్నట్లు వివరించారు. జిల్లా వ్యాప్తంగా ఫిట్టర్లు ఉండే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఆసక్తి కలిగిన పదో తరగతి చదివిన (పాస్/పెయిల్) యువతకు పత్తికొండ, ఎమ్మిగనూరు, కర్నూలు కేంద్రాల్లో శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఫిట్టర్లుగా శిక్షణ పొందేందుకు 08518–279724, 79950 10109, 96420 00919 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో తెలంగాణ వాసుల మృతి





మృతిచెందిన కూలీలు

కర్నూలు: మండలంలోని ఆర్.కొంతలపాడు గ్రామ శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో తెలంగాణ రాష్ట్రం జోగుళాంబ గద్వాల జిల్లా, వడ్డెపల్లి మండలం, తిమ్మాజిపల్లె గ్రామానికి చెందిన కురువ జమ్మన్న (42), కురువ జ్ఞానవంతుడు (25) అక్కడికక్కడే మృతిచెందారు. బొలెరో వాహనంలో పత్తి బేళ్లు తీసుకెళ్తుండగా కొంతలపాడు గ్రామ శివారులో రోడ్డుపై ఉన్న గుంత వల్ల వాహనం అదుపుతప్పి పక్కనున్న పొలంలోకి రెండు పల్టీలు కొట్టింది. వాహనంపై కూర్చున్న ఇద్దరిపై పత్తి బేళ్లు పడటంతో ఊపిరి ఆడక మృతిచెందారు. మరో ఐదుగురు కూలీలు గాయాల పాలయ్యారు. గొల్ల నరసింహ, శ్రీకాంత్, పరుశురాముడు, ఆంజనేయులు, సురేష్‌లకు ప్రమాదంలో గాయాలు కావడంతో వెంటనే ఆసుపత్రికి తరలించి వైద్య చికిత్సలు చేయించారు. విషయం తెలిసిన వెంటనే కర్నూలు అర్బన్ తాలూకా పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రి మార్చురీ కేంద్రంలో ఉంచారు. వాహన యజమాని రామాపురం గ్రామానికి చెందిన వెంకటరాముడును పోలీసులు విచారిస్తున్నారు. బాధిత కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

డాక్యుమెంట్స్ పోయినవి

G.అంకమ్మ, W/o G.రామయ్య(లేట్) వయస్సు: 61 సం॥లు. ఇ.నెం: 76/97-437-2-3, శాంతి నగర్, కర్నూలు జిల్లా. సవితానగర్, కల్లూరులోని ప్లాటు నెం: 40A రిజిష్టర్ డాక్యుమెంట్ నెం: 1313/2009. లింక్ డాక్యుమెంట్ నెం: 3077/1987 పోయినది. కొత్తబస్టాండ్ దగ్గర జిరాక్స్ షాప్‌కు వెళుతుంటే పోయినవి. ఎవరికైనా దొరికిన యెడల క్రింది నెంబర్‌ను సంప్రదించగలరు.

సెల్: 9985166766